సాక్షి అనంతపురం

బుధవారం । 17 । జూలై । 2024



టన్ను చీనీ రూ.18 వేలు

అనంతపురం మార్కెట్‌యార్డులో మంగళవారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.18 వేల ప్రకారం విక్రయాలు జరిగాయి.



విద్యుత్ శాఖ సిబ్బందిపై దాడి

విద్యుత్ శాఖలో పనిచేస్తున్న ఇద్దరు లైన్ మెన్లపై ఓ వ్యక్తి దాడి చేశాడు. పామిడి మండలంలో ఘటన జరిగింది. 8లో

గరిష్టం/కనిష్టం

34.4°/22.9°

జిల్లా అంతటా మంగళవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి వర్షం కురిసింది. గంటకు 10 నుంచి 16 కి.మీ వేగంతో నైరుతి దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

టీబీ డ్యాంకు పెరిగిన ఇన్‌ఫ్లో



నిండుకుండను తలపిస్తున్న టీబీ డ్యాం

బొమ్మనహాళ్: తుంగభద్ర జలాశయానికి ఇన్‌ఫ్లో పెరిగింది. సోమవారం 16,142 క్యూసెక్కులు ఉన్న ఇన్‌ఫ్లో మంగళవారం ఉదయానికి 36,170 క్యూసెక్కులకు ఎగబాకింది. బుధవారం 50 వేల క్యూసెక్కులకు పెరగవచ్చని బోర్డు అధికారులు తెలిపారు. జలాశయం ఎగువ ప్రాంతాల్లో వర్షాలు కురుస్తుండటంతో డ్యాంకు భారీగా వరద వస్తోంది.ప్రస్తుతం జలాశయంలో 105.788 టీఎంసీల పూర్తి నీటి నిల్వ సామర్థ్యానికి గానూ 35.473 టీఎంసీల నీరు నిల్వ ఉంది. అవుట్‌ఫ్లో 211 క్యూసెక్కులు నమోదవుతోంది. 1,633 అడుగుల నీటి మట్టానికి గాను 1,608.91 అడుగులకు నీరు చేరాయి.

ఆగస్టులో డ్రిప్, స్ప్రింక్లర్ల మంజూరు

అనంతపురం అగ్రికల్చర్: సేద్యపు పరికరాలైన డ్రిప్, స్ప్రింక్లర్లు (బిందు, తుంపర) ఆగస్టులో జిల్లాకు మంజూరయ్యే అవకాశం ఉందని ఏపీఎంఐపీ పీడీ బి.రఘునాథరెడ్డి తెలిపారు. మంగళవారం స్థానిక ఏపీఎంఐపీ కార్యాలయంలో ఏపీడీ జి.ఫిరోజ్‌ఖాన్‌తో కలిసి కంపెనీ డీసీఓలతో సమీక్ష నిర్వహించారు. కొత్త ప్రభుత్వం కొలువు తీరినందున త్వరలోనే కేటాయింపులు, మార్గదర్శకాలు విడుదల కానున్నట్లు తెలిపారు. నెలాఖరులోపు పాతవన్నీ క్లియర్ చేయాలని ఆదేశించారు. ఇంకా 200 హెక్టార్ల వరకూ మెటీరియల్ సప్లై, ఇన్‌స్టలేషన్ ఉన్నందున కంపెనీ ప్రతినిధులు వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

జిల్లాకు 1,300 మెట్రిక్ టన్నుల ఎరువులు




ఎరువులను పరిశీలిస్తున్న ఏడీఏ రవి

అనంతపురం అగ్రికల్చర్: ఖరీఫ్ ప్రణాళికలో భాగంగా నెలవారీ కోటా మేరకు మంగళవారం 1,300 మెట్రిక్ టన్నుల ఎరువులు జిల్లాకు చేరినట్లు ఏడీఏ రవి తెలిపారు. స్థానిక ప్రసన్నాయపల్లి రైల్వేస్టేషన్ రేక్‌పాయింట్‌లో వ్యాగన్ల ద్వారా వచ్చిన ఎరువులను ఆయన పరిశీలించారు. ఫ్యాక్ట్ ఫర్టిలైజర్స్ కంపెనీ నుంచి 1,000 మెట్రిక్ టన్నుల అమ్మోనియం సల్ఫేట్, 300 మెట్రిక్ టన్నుల 20-20-0-13 రకం కాంప్లెక్స్ ఎరువులు వచ్చాయన్నారు. కలెక్టర్, జేసీ, జేడీఏ ఆదేశాల మేరకు ఇండెంట్ ప్రకారం రైతుసేవా కేంద్రాలు, సొసైటీలు, ప్రైవేట్ హోల్‌సేల్ డీలర్లకు సరఫరా చేయడంతో పాటు మిగిలినవి కంపెనీ గోదాముల్లో నిల్వ చేయనున్నట్లు తెలిపారు.

ఉపకార వేతనాలకు దరఖాస్తు చేసుకోండి

అనంతపురం రూరల్: కేంద్ర ప్రభుత్వం అందించే ఉపకార వేతనాలకు 9, 10వ తరగతులు, ఇంటర్, డిగ్రీ, డిప్లొమా చదువుతున్న దివ్యాంగ విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఏడీ అబ్దుల్ రసూల్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. www.scholarships.gov.in వెబ్‌సైట్ ద్వారా వచ్చే నెల 30లోపు దరఖాస్తులు సమర్పించాలన్నారు. పోస్టు మెట్రిక్ విద్యార్థులు అక్టోబర్ 10 లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

జాతీయ స్థాయి ఉత్తమ టీచర్ అవార్డుకు..



అనంతపురం ఎడ్యుకేషన్: జాతీయస్థాయిలో అందజేసే ఉత్తమ టీచరు అవార్డుకు ఈనెల 21 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని జిల్లా విద్యాశాఖ అధికారి బి.వరలక్ష్మీ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆమె ఓ ప్రకటన విడుదల చేశారు. అన్ని యాజమాన్యాల పాఠశాలల్లోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల టీచర్లు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. http://nationalawardstoteacher.education.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. మ్యాన్యువల్ దరఖాస్తులు స్వీకరించరని స్పష్టం చేశారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసిన తర్వాత సంబంధిత ధ్రువీకరణ అధికారి ద్వారా ధ్రువీకరించుకుని డీఈఓ కార్యాలయంలో దరఖాస్తు హార్డ్‌కాపీ అందజేయాలన్నారు.

ఘనంగా పెద్ద సరిగెత్తు



ప్రత్యేక అలంకరణలో కుళ్లాయిస్వామి

నార్పల: మొహర్రం ఉత్సవాల్లో భాగంగా గూగూడు కుళ్లాయిస్వామి పెద్ద సరిగెత్తు మంగళవారం అంగరంగ వైభవంగా జరిగింది. భారీగా తరలివచ్చిన భక్తులతో గ్రామం జన సంద్రంగా మారింది. ఫకీరులైన భక్తాదులు పానకాలు తీసుకువచ్చారు. మహిళలు పొర్లుదండాలతో మొక్కులు తీర్చుకున్నారు. కొందరు తలనీలాలు సమర్పించారు. బుధవారం తెల్లవారుజాము 2 గంటలకు కుళ్లాయిస్వామి గ్రామోత్సవం, 6 గంటలకు అగ్ని గుండ ప్రవేశం ఉంటుంది. పీర్ల జలధి సాయంత్రం 3 గంటలకు ప్రారంభమవుతుంది. 4 గంటలకు కుళ్లాయి స్వామి మరోమారు అగ్ని గుండం ప్రవేశం చేస్తారు. అనంతరం గంగనపల్లి రోడ్డు వద్ద ఉన్న దిగుడు బావి వద్దకు తీసుకెళ్లి జలధోత్సవం పూర్తి చేస్తారు. కుళ్లాయిస్వామి చివరి దర్శనం శుక్రవారం సాయంత్రం 6 గంటలకు ఉంటుందని దేవదాయ శాఖ అధికారులు తెలిపారు.



కుళ్లాయిస్వామి అగ్నిగుండ మహోత్సవంలో పెద్ద సంఖ్యలో పాల్గొన్న భక్తులు

కాసుల వేట.. అవినీతి మేత

- రెండు రోజుల క్రితం వజ్రకరూరు మండల తహసీల్దార్ కార్యాలయంపై ఏసీబీ అధికారులు దాడులు నిర్వహించారు. భూమిని ఆన్‌లైన్‌లో ఎక్కించేందుకు లంచం తీసుకున్న తహసీల్దార్ మహ్మద్ రఫీని ఆధారాలతో సహా పట్టుకున్నారు. బాధితుల నుంచి ఫోన్‌పే ద్వారా తహసీల్దార్ తన బంధువుకు రూ.65 వేలు బదిలీ చేయించుకున్నట్లు గుర్తించారు.
- పట్టాదారు పాసు పుస్తకం మంజూరు కోసం రూ.10 వేల లంచం తీసుకుంటూ గోరంట్ల మండలానికి చెందిన వీఆర్‌ఓ చంద్రమౌళి కొన్ని నెలల క్రితం ఏసీబీ అధికారులకు దొరికాడు. భువనేశ్వరి అనే మహిళకు మండలపల్లి గ్రామపొలం సర్వే నంబరు 287-2లో 2.06 ఎకరాల భూమి ఉంది. ఈ స్థలానికి పాసు పుస్తకం మంజూరు చేసేందుకు ఆమె కుమారుడు వెంకటశివ నుంచి వీఆర్‌ఓ లంచం తీసుకుంటూ రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డాడు.
- బుక్కరాయసముద్రం మండల రెవెన్యూ కార్యాలయంలోనూ అవినీతి దందా జోరుగా సాగుతున్నట్లు సమాచారం. ఇక్కడి కొందరు అవినీతి అధికారులు, సిబ్బంది రైతుల నుంచి డబ్బులు దండుకుంటూ భూములకు సంబంధించి పీఓటీ (ప్రొహిబిషన్ ఆఫ్ ట్రాన్స్‌ఫర్) చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఉన్నతాధికారులు సమగ్ర విచారణ చేస్తే అక్రమాలు వెలుగులోకి వస్తాయని రెవెన్యూ వర్గాలే పేర్కొంటున్నాయి.

- అక్రమాలకు నిలయంగా తహసీల్దారు కార్యాలయాలు
- తిష్టవేసిన కొందరు అవినీతి సిబ్బంది
- ముడుపులు ముట్టచెపితేనే ఫైళ్లలో కదలిక
- ఏసీబీ దాడులు చేసినా కానరాని మార్పు



అనంతపురం అర్బన్: జిల్లా యంత్రాంగానికి పెద్దన్న పాత్ర పోషించే రెవెన్యూ శాఖలో అవినీతి దందాకు అడ్డూ అదుపూ లేకుండా పోతోంది. ప్రధానంగా తహసీల్దారు కార్యాలయాలు అక్రమాలకు నిలయంగా మారాయి. కొందరు అవినీతి అధికారులు, సిబ్బంది అక్రమార్జన ధ్యేయంగా కాసుల వేట సాగిస్తున్నారు. ఫైలు వచ్చిందంటే డబ్బు దండుకోవడమే లక్ష్యంగా పని చేస్తున్నారు. ముడుపులు ముట్టచెబితేనే ఫైళ్లలో కదలిక వస్తోంది. లేదంటే కొర్రీల మీది కొర్రీలతో ఆ ఫైలు ప్రదక్షిణలు చేస్తూనే ఉంటుంది. రైతు అవసరాన్ని ఆసరాగా చేసుకుని ఎంతైనా గుంజడం సర్వసాధారణంగా మారిందనే విమర్శలు సర్వత్రా వినిపిస్తున్నాయి.

ప్రతి పనికీ ఒక ధర

తహసీల్దారు కార్యాలయాల్లో ప్రతి పనికీ ఒక ధర ప్రకారం వసూలు చేస్తారనే ఆరోపణలు ఉన్నాయి. ఫైలు సిద్ధం చేసే దగ్గర నుంచి అధికారి సంతకం వరకు స్థాయిస్థాయిలో ముడుపులు ముట్టజెబుతూ ఉండాల్సిందే. ఆన్‌లైన్‌లో పేరు నమోదుకు ఒక రేటు, పాసుపుస్తకం మంజూరుకు మరో రేటు, మ్యుటేషన్‌కు ఒక రేటు, భూమిని ఆన్‌లైన్‌లో ఎక్కించేందుకు ఒక రేటు.. ఇలా ప్రతి పనికీ డబ్బు వసూలు చేయడం పరిపాటిగా మారినట్లు తెలుస్తోంది. కార్యాలయానికి వచ్చే వారి అవసరాన్ని బట్టి రేటు పది రెట్లు పెరుగుతుందనే ఆరోపణలు ఉన్నాయి. రెవెన్యూ సిబ్బందికి డబ్బు ఇవ్వకుండా పనిచేయించుకున్నామని చెప్పే వారు నేడు ఒక్కరూ ఉండరనే దాంట్లో అతిశయోక్తి లేదు.

డబ్బు అడిగితే ఫిర్యాదు చేయండి



రైతులను ఏ విధంగానూ ఇబ్బంది పెట్టరాదని తహసీల్దార్లు, సిబ్బందికి స్పష్టమైన ఆదేశాలు ఇచ్చాం. అయినా కొందరు తీరు మార్చుకోకుండా అవినీతికి పాల్పడుతున్నారు. ఇలాంటి వారిపై చర్యలు ఉంటాయి. పని చేసేందుకు రెవెన్యూ సిబ్బంది ఇబ్బంది పెట్టినా, డబ్బులు అడిగినా ఫిర్యాదు చేయాలి. సోమవారం రోజున కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో కలెక్టర్, జాయింట్ కలెక్టర్, నేను అందుబాటులో ఉంటాం. ఆ సందర్భంలో వచ్చి ఫిర్యాదు చేయవచ్చు. – జి.రామకృష్ణారెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి

రెండో రోజూ ఏసీబీ సోదాలు



తహసీల్దార్ మహ్మద్‌రఫీని ఆసుపత్రికి తీసుకెళ్తున్న అధికారులు

ఉరవకొండ: వజ్రకరూరు తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం కూడా ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహించారు. భూమి మ్యుటేషన్ కోసం రైతు నుంచి ఫోన్ పే ద్వారా రూ. 65 వేలు లంచం తీసుకుని ఏసీబీ అధికారులకు తహసీల్దార్ మహ్మద్ రఫీ పట్టుబడిన విషయం తెలిసిందే. నాలుగు నెలల క్రితమే ఇక్కడ తహసీల్దార్‌గా మహ్మద్ రఫీ బాధ్యతలు చేపట్టారు. నంద్యాల జిల్లాలో పనిచేస్తున్న ఆయనను సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కమిషన్ బదిలీ చేసింది. ఈ క్రమంలో విధుల్లో చేరినప్పటి నుంచి మహ్మద్‌రఫీ ఏ ఫైళ్లపై సంతకాలు పెట్టారో ఏసీబీ అధికారులు ఆరా తీశారు. పాసుపుస్తకాల మంజూరు, ఆన్‌లైన్‌లో నమోదు లాంటివి ఎన్ని క్లియర్ చేశారో ఏసీబీ డీఎస్పీ ప్రశాంతి ఆధ్వర్యంలో క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఆర్‌ఐ, వీఆర్‌ఓలను ఒక్కొక్కరిగా పిలిచి పలు వివరాలను అడిగి తెలుసుకున్నారు. దీంతో పాటు బాధిత రైతు కుటుంబాన్ని మరోసారి విచారించారు. కాగా, తహసీల్దార్ మహ్మద్ రఫీని మంగళవారం ఏసీబీ అధికారులు గుంతకల్లులోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్య పరీక్షల అనంతరం కర్నూలులోని ఏసీబీ కోర్టుకు తీసుకెళ్లారు.

జిల్లాలో పనిచేయడం సంతృప్తినిచ్చింది

- బదిలీ ఎస్పీ గౌతమి శాలి



'చింతల' ఆలయం విశిష్టతను ఎస్పీ గౌతమి శాలికి వివరిస్తున్న అర్చకులు

అనంతపురం: జిల్లాలో పనిచేయడం ఎంతో సంతృప్తినిచ్చిందని ఎస్పీ గౌతమి శాలి అన్నారు. ఇటీవల ఆమెను ప్రభుత్వం ఎన్టీఆర్ జిల్లాకు డీసీపీగా బదిలీ చేసిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా మంగళవారం ఆమె మాట్లాడుతూ జిల్లా ప్రజలు తనపై ఎంతో ఆప్యాయత కనబరిచారన్నారు. విధుల్లో సిబ్బంది ఎంతగానో సహకరించారన్నారు. అధికారులు, మీడియా ప్రతినిధులు, రాజకీయ పార్టీల నాయకులు, ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు.

చింతలరాయుడి సేవలో ఎస్పీ..

తాడిపత్రి అర్బన్/రూరల్: మండలంలోని చింతల వేంకటరమణస్వామి ఆలయాన్ని మంగళవారం ఎస్పీ గౌతమి శాలి సందర్శించారు. గర్భాలయంలో స్వామి మూలవిరాట్‌ను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారి చిత్రపటాన్ని, తీర్థ ప్రసాదాలను అర్చకులు ఎస్పీకి అందజేసి వేదాశీర్వచనం చేశారు. ఆలయంలో శిల్పకళా నైపుణ్యం గురించి ప్రధాన అర్చకులు మురళీ బట్టార్ ఆమెకు వివరించారు. అనంతరం ఆలూరు కోన రంగనాథస్వామిని ఎస్పీ దర్శించుకున్నారు.

బెంగళూరు-కలబుర్గి ప్రత్యేక రైళ్లు

గుంతకల్లు: బెంగళూరు-కలబుర్గి మార్గంలో ఈ నెల 19, 20వ తేదీల్లో ప్రత్యేక రైళ్లు నడుపుతున్నారు. 19న శుక్రవారం బెంగళూరు జంక్షన్ నుంచి రైలు (06533) రాత్రి 8 గంటలకు బయలుదేరి కలబుర్గికి శనివారం ఉదయం 7.45 గంటలకు చేరుతుంది. తిరిగి శనివారం ఉదయం 9.30కు బయలుదేరి రాత్రి 8.30 గంటలకు బెంగళూరు చేరుకుంటుంది. యలహంక, ధర్మవరం, అనంతపురం, గుంతకల్లు, ఆదోని, మంత్రాలయం రోడ్డు, రాయచూరు, యాద్గిరి, వాడి, షాహబాద్ మీదుగా రైలు రాకపోకలు సాగిస్తుంది.


'ఆదరణ'.. ఆక్రందన



జిల్లా న్యాయ సేవా సదన్ వద్ద ఆందోళన చేస్తున్న ఆదరణ చిట్‌ఫండ్స్ బాధితులు

- జిల్లా న్యాయ సేవా సదన్ వద్ద ఆదరణ చిట్ ఫండ్ సంస్థ బాధితుల ఆందోళన

అనంతపురం: ఆదరణ చిట్ ఫండ్స్ బాధితులు జిల్లా కోర్టు ప్రాంగణంలో ఆక్రందనలు చేశారు. తమ కష్టార్జితాన్ని దోచుకోవాలని చూస్తే మట్టికొట్టుకుపోతారంటూ సంస్థ నిర్వాహకులకు శాపనార్థాలు పెట్టారు. వివరాలు.. స్థానిక టవర్‌క్లాక్ సమీపంలో నిర్వహిస్తున్న ఆదరణ చిట్‌ఫండ్స్ నిర్వాహకులు బోర్డు తిప్పేసిన విషయం తెలిసిందే. చిట్స్ డబ్బు రూ.69 కోట్లు చెల్లించకుండా ఎగనామం పెట్టడంతో బాధితులు లోకాయుక్తలో కేసు దాఖలు చేశారు. ఇందుకు సంబంధించి మంగళవారం వాయిదా ఉండడంతో స్థానిక కోర్టుకు వచ్చారు. ఉదయం 9 గంటలకే జిల్లా కోర్టు ప్రాంగణం వద్దకు పెద్ద సంఖ్యలో చేరుకున్నారు. అయితే, లోకాయుక్త జడ్జి సెలవు పెట్టారని తెలియడంతో బాధితులు జిల్లా న్యాయసేవా సదన్ ఎదుట బైఠాయించి ఆందోళన చేపట్టారు. ఎలాగైనా కేసును విచారించాల్సిందేనని డిమాండ్ చేశారు. ఆదరణ చిట్‌ఫండ్స్ నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని నినదించారు. ఈ విషయాన్ని పోలీసులు, కోర్టు సిబ్బంది జడ్జి దృష్టికి తీసుకెళ్లడంతో మరో జడ్జికి కేసును బదలాయించగా, అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి నిర్మల కేసును విచారించారు. ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతూ తమ డబ్బుతో ఆదరణ నిర్వాహకులు భారీగా భూములు కొనుగోలు చేశారన్నారు. కస్టమర్ల నుంచి డబ్బు కోసం ఒత్తిడి పెరుగుతుండడంతో తప్పించుకు తిరుగుతున్నారని ఆవేదన చెందారు. న్యాయం చేయాలని కోరారు. ఆదరణ చిట్‌ఫండ్స్ తరఫున హాజరైన ఎస్. రామకృష్ణ, కే. శైలజ కుమారి, సురేంద్ర మాట్లాడుతూ తమకు ఉన్న 59 ఎకరాల భూమి, 12 ఎకరాల్లో ఉన్న భవనాలను విక్రయించి నవంబర్ 16 లోపు బాధితులకు చిట్ మొత్తాన్ని చెల్లిస్తామని లిఖిత పూర్వకంగా కోరారు. ఇందుకు జడ్జి సమ్మతించారు. 'మోసపోయాం.. ఓపిక పట్టాల్సిందే' అంటూ బాధితులు అక్కడి నుంచి నిష్క్రమించారు.



ఆదరణ నిర్వాహకులు రాసిచ్చిన లేఖ

రహదారులపై నెత్తుటేరులు

- నాలుగు రోజుల క్రితం అనంతపురం రూరల్ మండలంలో బైకుపై మితిమీరిన వేగంతో వెళుతున్న మహబూబ్ బాషా రోడ్డు డివైడర్‌కు ఢీకొట్టి ఘటనా స్థలంలోనే మృతి చెందాడు. మృతుడి వయసు 22 సంవత్సరాలు. దీంతో ఆ కుటుంబం తీరని విషాదంలో మునిగిపోయింది.
- మూడు నెలల క్రితం బైకుపై వెళుతున్న ముగ్గురు యువకులు నాయనపల్లె క్రాస్ వద్ద ఓ ఐచర్ వాహనాన్ని ఢీకొట్టారు. ఘటనాస్థలిలోనే ముగ్గురూ ప్రాణాలు వదిలారు. వీరందరూ 26 ఏళ్లలోపు వారే. అతి వేగంతో వెళ్తున్న క్రమంలో బండిని అదుపు చేయలేక ఎదురుగా వస్తున్న వాహనాన్ని ఢీకొని మృతి చెందినట్లు పోలీసులు నిర్ధారించారు.

- రోజు రోజుకూ పెరుగుతున్న రోడ్డు ప్రమాదాలు
- ఉమ్మడి జిల్లాలో 6 నెలల్లో 2,600కు పైగా ఘటనలు
- 240 మంది వరకూ మృతి
- కొంప ముంచుతున్న అతి వేగం
- మృతుల్లో ఎక్కువ శాతం హెల్మెట్ ధరించని వారే!

రోడ్డు ప్రమాదాల వివరాలిలా..

నెల	ప్రమాదాల సంఖ్య
జనవరి	342
ఫిబ్రవరి	404
మార్చి	418
ఏప్రిల్	536
మే	501
జూన్	464



సాక్షి ప్రతినిధి, అనంతపురం: ఉమ్మడి అనంతపురం జిల్లావ్యాప్తంగా రోజురోజుకూ రోడ్డు ప్రమాదాలు పెరుగుతున్నాయి. ప్రమాదాల కారణంగా బాధితులు భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తోంది. ముఖ్యంగా పాతికేళ్ల లోపు యువకులు ప్రాణాలు కోల్పోతుండడం ఆయా కుటుంబాలను కలచివేస్తోంది. విషాద వార్తలను తల్లిదండ్రులు జీర్ణించుకోలేకపోతున్నారు. నిర్లక్ష్యమే రోడ్డు ప్రమాదాలకు ముఖ్య కారణమని నిపుణులు చెబుతున్నారు.

70 శాతం 30 ఏళ్లలోపు వారే..

రోడ్డు ప్రమాదాల్లో రాయలసీమలోనే ఉమ్మడి అనంతపురం జిల్లా ముందువరసలో నిలుస్తోంది. జాతీయ రహదారుల విస్తీర్ణం ఎక్కువగా ఉండటం ఇందుకు కారణంగా తెలుస్తోంది. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా గడిచిన 6 నెలల్లోనే 2,607 రోడ్డు ప్రమాదాలు జరిగాయి. ఇందులో 90 శాతం ద్విచక్ర వాహన ప్రమాదాలే ఉన్నాయి. కార్లు, బస్సుల ప్రమాదాలు ఎక్కువగా హైదరాబాద్- బెంగళూరు జాతీయ రహదారిపై చోటుచేసుకున్నాయి. ప్రమాదాల్లో 240 మందికి పైగా మృతి చెందారు. మృతుల్లో 70 శాతం 30 ఏళ్లలోపు వారే కావడం కలచివేస్తున్న అంశం. ఇక.. ప్రమాదాల్లో గాయపడి శాశ్వత వైకల్యం పొందుతున్న వారి సంఖ్యా ఎక్కువగానే ఉంటోంది.

వేగమే కొంప ముంచుతోంది..

మితిమీరిన వేగం ప్రాణాలను బలిగొంటున్నట్టు తెలుస్తోంది. వేగంగా వెళ్తున్న సమయంలో అదుపు తప్పి వాహనాలను ఢీ కొట్టడం, కిందపడటం కారణంగా యువకులు తీవ్ర గాయాలపాలవడం, ఘటనా స్థలిలోనే మృతి చెందడం సంభవిస్తున్నాయి. తల్లిదండ్రులపై పిల్లలు ఒత్తిడి తెచ్చి 150 సీసీ నుంచి 350 సీసీ బైకులు కొనుక్కుంటున్నారు. బైకు కొన్న కొద్దిరోజులకే తన కుమారుడి విషాద వార్త వినాల్సి వచ్చిందని గుత్తికి చెందిన ఓ బాధిత తల్లి ఆవేదన వ్యక్తం చేశారు. బైకులు నడిపే సమయంలో చాలామంది హెల్మెట్ వాడకపోవడం కూడా ప్రాణాల మీదకు తెస్తోంది.



గాయపడిన విద్యార్థులు

అనంతపురం ఆర్టీసీ బస్టాండు సమీపంలో మంగళవారం రోడ్డు ప్రమాదం జరిగింది. పీవీకేకే ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ రెండో సంవత్సరం చదువుతున్న లెస్టర్ రాయ్ (గుత్తి ఆర్.ఎస్), భరత్ (యాడికి), గిరీష్ కుమార్‌రెడ్డి బైకుపై వేగంగా వెళ్తూ రాజహంస అపార్ట్‌మెంట్ వద్ద ఆగి ఉన్న కారును ఢీకొన్నారు. ఘటనలో లెస్టర్ రాయ్ అనే విద్యార్థికి తీవ్రగాయాలు అయ్యాయి. భరత్ (యాడికి), గిరీష్ కుమార్‌రెడ్డి స్వల్పగాయాలతో బయటపడ్డారు.

తల్లిదండ్రులు కౌన్సెలింగ్ ఇవ్వాలి

ఎక్కువ వేగంగా వెళ్లడమనేది యువత ఈ రోజుల్లో ఫ్యాషన్‌గా భావిస్తున్నారు. అత్యంత వేగంగా వెళితే తమకు మంచి గుర్తింపు లభిస్తుందనేది వారి ఆలోచనగా ఉంటోంది. కానీ అది మానసిక జబ్బు. తల్లిదండ్రులే వీరికి మంచి కౌన్సెలింగ్ ఇవ్వాలి.

–డా.విశ్వనాథరెడ్డి, మానసిక వైద్యనిపుణులు, అనంతపురం

క్లుప్తంగా

'పెసర'లో యాజమాన్యం పాటించండి



పెసర విత్తనం అందజేస్తున్న కేవీకే శాస్త్రవేత్తలు

బుక్కరాయసముద్రం: పెసర సాగు చేస్తున్న రైతులు యాజమాన్య పద్ధతులు పాటిస్తే మంచి దిగుబడులు సాధించవచ్చునని రెడ్డిపల్లి కృషి విజ్ఞాన కేంద్రం వ్యవసాయ విస్తరణా శాస్త్రవేత్త డాక్టర్ చందన తెలిపారు. 96వ భారతీయ వ్యవసాయ మండలి దినోత్సవం సందర్భంగా 100 రోజుల వికసిత్ భారత్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం కేవీకేలో రైతు ఉత్పత్తి దారులకు శిక్షణా కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డాక్టర చందన మాట్లాడారు. పెసర సాగులో చేపట్టాల్సిన జాగ్రత్తలను వివరించారు. సమగ్ర యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. అనంతరం షెడ్యూలు కులాల వారికి డబ్ల్యూజీజీ–42 రకం పెసర విత్తనాన్ని అందజేశారు. కార్యక్రమంలో పశు విజ్ఞాన శాస్త్రవేత్త డాక్టర్ మాధవి, ప్రభు మిత్రా రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

మట్టితో కప్పిన గుండంలో వెలుగుతున్న నిప్పు



అగ్నిగుండంలో ఎగిసి పడుతున్న మంటలు

కుందుర్పి: సాధారణంగా కట్టెలు కాలిన తర్వాత నిప్పుపై మట్టి వేసి కప్పితే గంటల వ్యవధిలో పూర్తిగా ఆరి పోయి బొగ్గుగా మారుతుంది. అయితే కుందుర్పి మండలం రుద్రంపల్లిలో గత ఏడాది మొహరం ముగింపు సందర్భంగా మట్టితో కప్పేసిన అగ్నిగుండంలో మంటలు అలాగే ఎగిసి పడుతున్నాయి. సోమవారం రాత్రి 11 గంటల సమయంలో మట్టితో కప్పిన అగ్ని గుండాన్ని చావిడి పూజారుల ఆధ్వర్యంలో గ్రామస్తులు తవ్వారు. గుండం మధ్యలో మంటలు ఎగిసి పడుతూ కనిపించడంతో గ్రామస్తులు భక్తిపారవశ్యంతో పులకించి పోయారు. గుండం చుట్టూ ప్రదక్షిణలు చేస్తూ గంధపు చెక్కలు, ఇతర సుగంధ ద్రవ్యాలు వేసి పూజలు చేశారు. ఇదంతా దేవుడి మహిమగా గ్రామస్తులు పేర్కొంటూ భక్తుల కోర్కెలు తీర్చేందుకే దేవుడే అగ్ని రూపంలో ప్రత్యక్షమయ్యాడని విశ్వాసం వ్యక్తం చేశారు.

● బెడ్డు... ఖాళీ ఉంటేే ఒట్టు



రోగులతో కిక్కిరిసిన మేల్ వార్డు





జ్వరాలు, వాంతులు, విరేచనాలతో చికిత్స పొందుతున్న చిన్నారులు

ఉమ్మడి జిల్లాకు పెద్ద దిక్కుగా ఉన్న అనంతపురంలోని సర్వజనాస్పత్రి రోగులతో కిక్కిరిస్తోంది. వాంతులు, విరేచనాలతో పాటు విష జ్వరాల బారిన పడిన రోగులు భారీగా తరలివస్తుండడంతో ఆస్పత్రిలో బెడ్లు ఖాళీగా లేకుండా పోయాయి. మంగళవారం ఓపీ 2,200 కాగా, ఐపీ 1,100గా నమోదైంది. ఈ నెల 11 నుంచి ఇప్పటి వరకూ 724 డయేరియా కేసులు నమోదయ్యాయి.

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం:



రోగులకు చికిత్స చేస్తున్న డాక్టర్ భీమసేనాచార్



జ్వరాలతో మంచాన పడిన రోగులు

ఏపీజీఎల్ఐసీ సమస్యలు పరిష్కరించాలి : ఎస్టీయూ



జీఎల్ఐసీ అధికారికి వినతిపత్రం అందజేస్తున్న ఎస్టీయూ నాయకులు

అనంతపురం ఎడ్యుకేషన్: ఉద్యోగ, ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న ఏపీజీఎల్ఐసీ సమస్యలను పరిష్కరించాలని రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం జీఎల్ఐసీ అధికారులను కలసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్టీయూ జిల్లా అధ్యక్ష,ప్రధానకార్యదర్శులు రమణారెడ్డి, రామాంజనేయులు మాట్లాడారు. ఉమ్మడి జిల్లాలోని ఉపాధ్యాయులు, ఉద్యోగులకు సంబంధించి మిస్సింగ్ క్రెడిట్ ఖాతాల క్రమబద్ధీకరణ సక్రమంగా చేయడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. మెచ్యూర్ అయిన బాండ్లకు ఫైనల్ పేమెంట్స్ సంబంధిత డీడీఓ ఏపీజీఎల్ఐసీ లాగిన్‌లో పంపినా డిప్యూటీ డైరెక్టర్ స్పందించక పోవడం బాధాకరమన్నారు. ప్రపోజల్స్‌ను తన లాగిన్‌లోనే పెట్టుకుని రాష్ట్ర కార్యాలయానికి పంపకుండా ఆన్‌లైన్ సమస్య అంటూ బుకాయిస్తున్నారని మండిపడ్డారు. అన్ని జిల్లాలకు సంబంధించిన ఫైనల్ పేమెంట్స్ సీఎఫ్ఎంఎస్‌కు వెళ్తున్నాయన్నారు. కేవలం ఉమ్మడి జిల్లాలో మాత్రమే పెండింగ్ ఉంటున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. వెంటనే సమస్యల పరిష్కారానికి చొరవ తీసుకోవాలని కోరారు. అనంతరం జిల్లా పరిషత్ అధికారులను కలిసి పీఎఫ్ సమస్యలపై మాట్లాడారు. ఉద్యోగ, ఉపాధ్యాయుల పీఎఫ్ స్లిప్స్ ఆన్‌లైన్‌లో రెండేళ్లుగా పొందుపరచడం లేదన్నారు. వెంటనే ఆన్‌లైన్ చేయాలని, రుణాల ప్రక్రియ త్వరగా పూర్తి చేయాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎస్టీయూ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి జి. సూర్యుడు, రాష్ట్ర కౌన్సిలర్లు సుగుమంచి సురేష్ బాబు, ఫణి భూషణ్, జిల్లా నాయకులు పరమేశ్వర రెడ్డి, నాయకులు కరణం చంద్ర శేఖర్ స్వామి, ప్రభాకర్, సురేష్ కుమార్, రాజన్న, కృష్ణమూర్తి నాయుడు, రమేష్, గంగాధర్, చంద్రశేఖర్ నాయుడు పాల్గొన్నారు.

'ముచ్చుమర్రి' ఘటనలో ప్రభుత్వ వైఫల్యం

- 10 రోజులవుతున్నా లభ్యం కాని బాలిక ఆచూకీ
- బాధిత కుటుంబానికి రూ.కోటి పరిహారం, ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలి
- మాజీ ఎంపీ డాక్టర్ తలారి రంగయ్య



కళ్యాణదుర్గం: నంద్యాల జిల్లా ముచ్చుమర్రిలో కనిపించకుండా పోయిన బాలిక ఆచూకీ పసిగట్టడంలో ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందిందని మాజీ ఎంపీ, కళ్యాణదుర్గం వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త డాక్టర్ తలారి రంగయ్య ధ్వజమెత్తారు. స్థానిక వైఎస్సార్‌సీపీ పార్టీ కార్యాలయంలో మంగళవారం ఆయన 'సాక్షి'తో మాట్లాడారు. 5వ తరగతి చదువుతున్న గిరిజన బాలిక ఈ నెల 7వ తేదీన అదృశ్యమైతే ఇప్పటికీ ఆచూకీ కనిపెట్టలేక పోవడం ప్రభుత్వ వైఫల్యాలకు నిదర్శనమన్నారు. చీరాలలో ఓ బాలికపై అత్యాచారం జరిగితే స్వయంగా హోం మంత్రి అనిత వెళ్లి పరామర్శించి వచ్చారని, అదే నంద్యాలలో గిరిజన బాలిక అదృశ్యమైతే ఏ ఒక్క ప్రజా ప్రతినిధి కూడా అటువైపు కన్నెత్తి చూడడం లేదని మండిపడ్డారు. చీరాల బాలిక ఘటనపై డిప్యూటీ సీఎం పవన్, మంత్రి లోకేష్ స్పందించడం... నంద్యాలలో బాలిక అదృశ్యంపై నోరు మెదకపోవడంపై పలు అనుమానాలకు తావిస్తోందన్నారు. ప్రతి ఆడబిడ్డకు రక్షణగా ఉంటామని, ఎలాంటి అన్యాయం జరిగినా వెంటనే చర్యలు తీసుకుంటామని చెప్పిన డిప్యూటీ సీఎం ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. మంత్రి లోకేష్ కేవలం రెడ్ బుక్ పరిశీలనకే సమయం కేటాయించడం సరైంది కాదన్నారు. గతంలో ఉమ్మడి అనంత జిల్లాలోని గోరంట్లలో ఓ చిన్నారిపై 43 ఏళ్ల వ్యక్తి అత్యాచారానికి పాల్పడితే సంఘటితంగా పోరాడి ఉద్యమం చేసిన నేతలు ఇప్పుడు ముచ్చుమర్రి ఘటనలో ఎందుకు బయటకు రాలేకపోతున్నారని ప్రశ్నించారు. బాధిత బాలిక కుటుంబానికి రూ.కోటి పరిహారంతో పాటు కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేకుంటే ఉద్యమ కార్యాచరణతో పోరాటాలు సాగిస్తామన్నారు.

ఫర్టిలైజర్ దుకాణాల్లో తనిఖీలు

ఉరవకొండ: స్థానిక లక్ష్మీవెంకటేశ్వర, విశ్వాస్, గౌరీ ఫర్టిలైజర్ దుకాణాలను మండల వ్యవసాయాధికారి శుభకర్ మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు. లక్ష్మీవెంకటేశ్వరలో అనుమతుల్లేకుండా నిల్వ చేసిన రూ.67 వేల విలువ చేసే పురుగు మందుల విక్రయాలకు స్టాప్ సేల్స్ నోటీసులు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నకిలీ మందులను విక్రయిస్తే కఠిన చర్యల తీసుకుంటామని హెచ్చరించారు. కొనుగోలు చేసిన ప్రతి సరుకుకూ రసీదులు తప్పనిసరిగా ఇవ్వాలని ఆదేశించారు. కాలం చెల్లిన పురుగు మందుల విక్రయాలు నిలుపుదల చేయాలని సూచించారు.

రూ.లక్ష విలువ చేసే మందుల విక్రయాల నిలిపివేత

గార్లదిన్నె: మండల కేంద్రంలోని పలు ఫర్టిలైజర్ షాపుల్లో మండల వ్యవసాయాధికారి సోమశేఖర్‌తో కలసి అనంతపురం ఏడీఏ రవి ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. శ్రీ లక్ష్మి ఫర్టిలైజర్, అగర్వా ఆగ్రో ఏజెన్సీ, మణికంఠన్ ఫామ్ ప్రొడక్ట్స్ షాపుల్లో చేపట్టిన తనిఖీల్లో ప్రిన్సిపుల్ సర్టిఫికెట్ లేకపోవడం, భౌతిక, రికార్డు నిల్వల్లో వ్యత్యాసాలు ఉండడం, స్టాక్ బోర్డు, రిజిస్టర్లను సక్రమంగా నిర్వహించక పోవడం గుర్తించారు. మూడు ఫర్టిలైజర్ షాపుల్లో రూ.1,02,520 విలువ చేసే పురుగు, కలుపు మందుల విక్రమయాలు నిలుపుదల చేస్తూ నోటీసులు జారీ చేశారు.

మొక్కలు పెంపకంతోనే మనుగడ

- జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ



మొక్క నాటి నీళ్లు పోస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ

అనంతపురం సిటీ: ప్రతి ఒక్కరూ ఉద్యమ స్థాయిలో మొక్కలు నాటి సంరక్షించినప్పుడే మానవ మనుగడ సాధ్యమవుతుందని జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ అన్నారు. కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ పిలుపు మేరకు 'హరిత అనంత' కార్యక్రమంలో భాగంగా పీఆర్‌ఐ సబ్ డివిజన్–2 కార్యాలయ ఆవరణలో ఈఈ చంద్రశేఖర్, డీఈఈ శ్రీనివాసమూర్తి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె పాల్గొని వివిధ రకాల మొక్కలు నాటి నీళ్లు పోసి, మాట్లాడారు. చెట్లను విచక్షణారహితంగా నరికేస్తుండడంతో అనేక రకాల రుగ్మతలతో ప్రజలు ఉక్కిరిబిక్కిరైపోతున్నారన్నారు. ప్రభుత్వాలు మొక్కల పెంపకానికి ప్రాధాన్యం ఇస్తున్నా ప్రజలు తమ బాధ్యతను విస్మరించి, చెట్లను నిర్లక్ష్యంగా నరికివేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కరోనా విపత్కర పరిస్థితుల్లో ఆక్సిజన్ అందక లక్షలాది మంది అర్ధాంతరంగా ప్రాణాలు కోల్పోయారని గుర్తు చేశారు. అలాంటి విపత్కర పరిస్థితుల నుంచి బయటపడాలన్నా... భావి తరాలు ఆరోగ్యంగా ఉండాలన్నా ప్రతి ఒక్కరూ ఇప్పటి నుంచే కనీసం ఒక మొక్క నాటి సంరక్షించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డీఎల్‌డీఓ ఓబుళమ్మ, పీఆర్‌ఐ సబ్ డివిజన్ ఉద్యోగులు సురేష్‌రెడ్డి, జగన్, జెడ్పీ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్‌ఆర్‌ఐటీకి ఐఎస్‌ఓ గుర్తింపు



ఐఎస్‌ఓ గుర్తింపు సర్టిఫికెట్ అందుకుంటున్న ఆలూరి సాంబశివారెడ్డి

బుక్కరాయసముద్రం: మండల పరిధిలోని రోటరీపురం వద్ద ఉన్న ఎస్‌ఆర్‌ఐటీ (అటానమస్) కళాశాలకు ఐఎస్‌ఓ గుర్తింపు దక్కింది. ఈ మేరకు ఆ కళాశాల కరెస్పాండెంట్ ఆలూరి సాంబశివారెడ్డి మంగళవారం తెలిపారు. ఐఎస్‌ఓ నుంచి 2100.2018, ఐఎస్‌ఓ 50001.2018, ఐఎస్‌ఓ 14001.2015 ప్రమాణ పత్రాలు లభించాయన్నారు. ఈ పత్రాలను మంగళవారం కళాశాలను సందర్శించిన ఐఎస్‌ఓ ప్రతినిధులు అందజేశారన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బాలకృష్ణ, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ద్వారకానాథ్‌రెడ్డికి కలెక్టర్ అభినందన



ద్వారకనాథ్‌రెడ్డిని సన్మానిస్తున్న కలెక్టర్

అనంతపురం అర్బన్: భారత్ బాస్కెట్ బాల్ జట్టు క్రీడాకారుడు కె.ద్వారకానాథ్‌రెడ్డిని కలెక్టర్ వి.వినోద్‌కుమార్ అభినందించారు. మంగళవారం కలెక్టర్‌ను కలెక్టరేట్‌లోని ఆయన చాంబర్‌లో ద్వారకానాథ్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఆయనను అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. శ్రీలంకలో ఈ నెల 9 నుంచి 13వ తేదీ వరకూ జరిగిన అండర్–18 ఏషియన్ బాస్కెట్‌బాల్ చాంపియన్ షిప్ (ఏబీసీ)లో భారత్ జట్టు తరపున ప్రాతినిధ్యం వహించిన ద్వారకానాథ్‌రెడ్డి ఆట తీరును ఆయన తండ్రి హరినాథ్‌రెడ్డి వివరించారు. ఫెడరేషన్ ఆఫ్ ఇంటర్నేషనల్ బాస్కెట్ బాల్ అసోసియేషన్ (ఎఫ్ఐబీఏ) ఆధ్వర్యంలో సెప్టెంబరు 2 నుంచి 9వ తేదీ వరకు మాల్దీవుల్లో జరగనున్న పోటీల్లో అండర్–18లో భారత జట్టు తరపున ప్రాతినిధ్యం వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డీఎస్‌డీఓ షఫీ, కోచ్ వంశీరెడ్డి, తల్లి చంద్రిక, సోదరి పాల్గొన్నారు.

విద్యుత్ శాఖ సిబ్బందిపై దాడి

పామిడి: విద్యుత్ శాఖలో పనిచేస్తున్న ఇద్దరు లైన్‌మెన్లపై ఓ వ్యక్తి చెప్పుతో దాడి చేశాడు. పోలీసులు తెలిపిన మేరకు... కరెంటు బిల్లుల వసూళ్లలో భాగంగా పామిడి మండలం దిబ్బసానిపల్లికి మంగళవారం ఉదయం సీనియర్ లైన్‌మెన్ కృష్ణానాయక్, జూనియర్ లైన్‌మెన్ స్టీఫెన్ వెళ్లారు. ఆ సమయంలో స్థానికుడు రంగేష్ వారిని దుర్భాషలాడుతూ చెప్పులతో దాడికి తెగబడ్డాడు. బాధితులు మండల కేంద్రానికి చేరుకుని ఘటనపై ఏఈ మధుసూదన్ రావుతో కలసి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు సీఐ రాజశేఖర రెడ్డి తెలిపారు.

విద్యుత్ షాక్‌తో కౌలు రైతు మృతి



దేవరాజు (ఫైల్)

కుందుర్పి: విద్యుత్ షాక్‌కు గురై ఓ కౌలు రైతు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... కుందుర్పి మండలం బెస్తరపల్లి గ్రామానికి చెందిన చాకలి దేవరాజు(36)కు భార్య శోభ, ఐదేళ్ల లోపు ఇద్దరు కుమారులు ఉన్నారు. బెస్తరపల్లి నివాసి రైతు తలారి ఆనంద్‌కు చెందిన 2 ఎకరాల భూమిని కౌలుకు తీసుకుని రెండేళ్లుగా టమాట, ఇతర పంటలు సాగు చేస్తున్నాడు. మంగళవారం ఉదయం టమాట పంటకు నీరు పెట్టేందుకు వెళ్లిన ఆయన తోటలో ఉన్న విద్యుత్ మోటార్ స్టార్టర్ పెట్టె తలుపు తీస్తుండగా షాక్‌కు గురై అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

ట్రాక్టర్‌ను ఢీకొని యువకుడి మృతి

అనంతపురం: ట్రాక్టర్‌ను వెనుక నుంచి ఢీకొన్న ఘటనలో ద్విచక్ర వాహనదారుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... అనంతపురం నగర శివారులోని రుద్రంపేటకు చెందిన అంజి, అభి భవన నిర్మాణ కార్మికులుగా జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో అనంతపురం రూరల్ మండలం పరిధిలోని ముష్టూరు వద్ద నూతనంగా నిర్మిస్తున్న గృహానికి టైల్స్ వేయడానికి మంగళవారం ఉదయం ద్విచక్ర వాహనంపై బయలుదేరారు. కృష్ణంరెడ్డిపల్లి దాటిన తర్వాత జాతీయ రహదారిపై రివర్స్‌లో వస్తున్న ట్రాక్టర్‌ను గమనించకుండా వేగంగా వెళ్లి ఢీకొన్నారు. ఘటనలో గాయపడిన ఇద్దరినీ స్థానికులు వెంటనే సర్వజనాస్పత్రికి తరలించారు. చికిత్సకు స్పందించక అంది మృతి చెందాడు. స్వల్పగాయాలతో అభి చికిత్స పొందుతున్నాడు. ఘటనపై ఇటుకలపల్లి ఎస్ఐ రాఘవేంద్రరెడ్డి కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

ప్రసవించిన అవివాహిత!

- తొలుత శిశువును వద్దనుకున్న తల్లి
- అధికారుల భరోసాతో కారకు లెవరో తెలిపిన యువతి
- సమగ్ర విచారణ చేపట్టిన పోలీసులు, ఐసీడీఎస్ అధికారులు
- పెళ్లి జరిపించేందుకు సిద్ధమైన పెద్దలు



శిశువును అక్కున చేర్చుకుని రోదిస్తున్న తల్లి

రాయదుర్గంటౌన్: పెళ్లి కాకుండానే ఓ యువతి పండంటి ఆడశిశువుకు జన్మనిచ్చింది. అయితే బిడ్డకు తండ్రి ఎవరో చెప్పడానికి నిరాకరించిన ఆమె తొలుత నవజాత శిశువును వద్దనుకుంది. విషయం తెలుసుకున్న ఐసీడీఎస్ అధికారులు, పోలీసులు అక్కడకు చేరుకుని విచారణ చేపట్టారు.

అధికారుల భరోసాతో వివరాల వెల్లడి

డి.హీరేహాళ్ మండలంలోని ఓ గ్రామానికి చెందిన ఓ యువతి పెళ్లి కాకుండానే గర్భం దాల్చింది. మంగళవారం మధ్యాహ్నం పురిటి నొప్పులు రావడంతో కుటుంబసభ్యులు వెంటనే రాయదుర్గంలోని ఏరియా ఆస్పత్రికి తరలించారు. పండంటి ఆడ శిశువుకు జన్మనిచ్చిన తర్వాత బిడ్డ తండ్రి పేరు చెప్పేందుకు ఆమె నిరాకరించింది. తండ్రి, సోదరుడు కూడా తమకేమీ తెలియదన్నారు. చివరకు నవజాత శిశువును తమతో పాటు తీసుకెళ్లలేమని ఆ యువతి మొండి కేసింది. దీంతో ఆస్పత్రి సిబ్బంది నుంచి సమాచారం అందుకున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఈశ్వరమ్మ, డి.హీరేహాళ్ ఎస్ఐ గురుప్రసాదరెడ్డి అక్కడకు చేరుకుని విచారణ చేపట్టారు. అన్ని విధాలా అండగా ఉంటామని భరోసానివ్వడంతో జరిగిన మొత్తం దారుణాన్ని బాధితురాలు వివరించింది.

తమ గ్రామానికి చెందిన యువకుడే..

రాయదుర్గం: పదో తరగతి వరకు చదువుకుని మానేసిన యువతి తల్లి మూడేళ్ల క్రితం మృతి చెందింది. అప్పటి నుంచి తన తండ్రి, అన్న సంరక్షణలోనే ఉంటున్న ఆమె వారితో కలసి బెంగళూరులో పనికోసం వెళ్లిన సమయంలో తమ గ్రామానికి చెందిన మంజునాథ్ పరిచయమయ్యాడు. ప్రేమ పేరుతో ఆమెను లోబర్చుకున్నాడు. కొన్ని రోజుల క్రితం తండ్రితో కలసి స్వగ్రామానికి చేరుకున్న ఆమె తన కడుపులో బిడ్డ పెరుగుతోందనే విషయం గుర్తించినా తండ్రి, అన్నకు చెప్పలేక పోయింది. మంగళవారం మధ్యాహ్నం కడుపులో నొప్పి అంటూ బాధపడుతున్న ఆమెను తండ్రి రాయదుర్గంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లాడు. అక్కడ వైద్యుడు లేకపోవడంతో ప్రభుత్వాస్పత్రికి చేర్చాడు. పరీక్షించిన వైద్యులు ఆమె పురిటి నొప్పులతో బాధపడుతున్నట్లు గుర్తించి, వెంటనే కాన్పుల వార్డులోకి తీసుకెళ్లారు. కొద్దిసేపటి తర్వాత ఆమె ఆడబిడ్డకు జన్మనిచ్చింది. విషయం తెలుసుకున్న తండ్రి, బంధువులు తొలుత ఆందోళనకు గురయ్యారు. జరిగిన విషయం మొత్తం యువతి ద్వారా తెలుసుకున్న పెద్దలు... ఇద్దరూ ఒకే సామాజిక వర్గానికి చెందిన వారు కావడంతో పెళ్లి చేయాలని నిశ్చయించారు. ఇదిలా ఉండగా యువకుడు పెళ్లికి నిరాకరించి మోసం చేయాలని చూస్తే ఆందోళన చేపట్టేందుకు యువతి బంధువులు సిద్ధమయ్యారు. ఈ విషయంపై డి.హీరేహాళ్ ఎస్ఐ గురుప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ.. ఇద్దరు మేజర్లు కావడంతో పెద్దల సమక్షంలో రాజీ ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిపారు.

పెండింగ్ ప్రాజెక్టుల పూర్తికి కృషి చేయాలి



మాట్లాడుతున్న డాక్టర్ శైలజానాథ్

కళ్యాణదుర్గం: రాష్ట్రంలో అత్యంత వెనుకబడిన అనంతపురం జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయాలంటే పదేళ్లుగా పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులన్నింటినీ పూర్తి చేయించాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఏపీ పీసీసీ మాజీ అధ్యక్షుడు డాక్టర్ శైలజానాథ్ అన్నారు. దీనిని బాధ్యతగా స్వీకరించాలని టీడీపీ ఎంపీ, ఎమ్మెల్యేలకు సూచించారు. మంగళవారం కళ్యాణదుర్గంలోని ఆర్అండ్‌బీ అతిథి గృహంలో పీసీసీ సభ్యుడు రాంభూపాల్ రెడ్డితో కలసి ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. విభజిత ఏపీలో రాయలసీమ జిల్లాలకు ప్రత్యేక నిధులు రావాల్సి ఉన్నా వాటిని కేంద్రం మంజూరు చేయకుండా నిర్లక్ష్యం కనబరుస్తోందన్నారు. జిల్లా కేంద్రంలో సెంట్రల్ యూనివర్సిటీ నిర్మాణం మొండి గోడలకే పరిమితమైందన్నారు. ప్రత్యేక హోదా, కడప ఉక్కు కోసం ప్రజా ప్రతినిధులు ఉద్యమించాల్సిన అవసరం ఉందన్నారు. వర్షాభావం నెలకొన్న ప్రస్తుత పరిస్థితుల్లో జిల్లా రైతులను ఆదుకునేందుకు ప్రత్యేక ప్రణాళిక చేపట్టాలని కోరారు. హంద్రీనీవా, హెచ్చెల్సీ ద్వారా వచ్చే నీటిని దిగువకు పంపకుండా జిల్లా అవసరాలకు పూర్తి స్థాయిలో వినియోగించాలని డిమాండ్ చేశారు. ఎన్నికల మేనిఫెస్టోలో భాగంగా ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు తిమ్మప్ప, మాల ఎర్రిస్వామి, తిమ్మరాజు, బలరామిరెడ్డి, గోవిందప్ప, పరమేశ్వరప్ప, ఈశ్వర్, సోమశేఖర్, నాగభూషణ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

20 నుంచి హాస్టళ్ల సందర్శన



మాట్లాడుతున్న ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కుళ్లాయిస్వామి

అనంతపురం అర్బన్: సంక్షేమ శాఖల వసతిగృహాల్లోని విద్యార్థుల సమస్యలు తెలుసుకునేందుకు ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఈనెల 20 నుంచి 30వ తేదీ వరకు హాస్టళ్లను సందర్శించనున్నట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రమణయ్య, కుళ్లాయిస్వామి తెలిపారు. మంగళవారం స్థానిక నీలం రాజశేఖర్ రెడ్డి భవన్‌లోవారు విలేకరులతో మాట్లాడారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, గురుకుల వసతి గృహాలను సందర్శించి అక్కడి సమస్యలను గుర్తించి వాటిపై ఆగస్టు 6న ఆందోళనలు నిర్వహిస్తామన్నారు. హాస్టళ్ల విద్యార్థులకు మెస్, కాస్మొటిక్ చార్జీలను పెంచాలని, పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ గురుకులాలు, కస్తూర్బా పాఠశాలల్లో సీట్ల సంఖ్య పెంచాలన్నారు. హాస్టళ్లలో నాడు–నేడు కింద చేపట్టిన ప్రహరీ నిర్మాణాలు పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో నగరాధ్యక్షుడు మంజునాథ్, జిల్లా ఉపాధ్యక్షుడు వంశీ, నాయకులు హరికృష్ణ, ఆనంద్, సమీర్, పవన్, నాని, మన్సూర్, శంకర్, ఇమ్రాన్, కార్తీక్, నాగేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

జల్లమ్మ స్వామికి చక్కెర చదివింపులు



చక్కెర చదివింపుల కోసం జల్లమ్మస్వామి దర్గా వద్దకు వచ్చిన భక్తులు

రాప్తాడు: గొందిరెడ్డిపల్లిలో వెలసిన జల్లమ్మ స్వామికి మంగళవారం సాయంత్రం భక్తులు ఘనంగా చక్కెర చదివింపు కార్యక్రమం నిర్వహించారు. జల్లమ్మ బావి వద్ద ఉన్న దర్గా వద్దకు వందలాది మంది మహిళలు, భక్తులు ఊరేగింపుగా వెళ్లి పూజలు చేశారు. ఈ సందర్భంగా 10 బస్తాల చక్కెరను తెచ్చి స్వామికి సమర్పించారు. జల్లస్వామి కాపులతో పాటు, చుట్టు పక్కల గ్రామాల నుంచి వచ్చిన భక్తులు పాల్గొన్నారు. రాత్రి గ్రామంలోని పీర్లచావిడి వద్ద నిర్వహించిన పానకాల కార్యక్రమంలో కూడా పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఆరోగ్య సమాచారం పదిలం

• సర్వజనాస్పత్రిలో 20 టీవీల ఏర్పాటు



మెడిసిన్ వార్డు ఆవరణలో ఏర్పాటు చేసిన టీవీ

అనంతపురం మెడికల్: రోగులకందించే సేవలు, అనారోగ్య సమస్యలను ఏవిధంగా ఎదుర్కోవాలో తెలియడంతోపాటు ప్రభుత్వ పథకాలను తెలియజేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సిద్ధమయ్యాయి. ఇందులో భాగంగా సర్వజనాస్పత్రిలోని మెడిసిన్, సర్జికల్, ఈఎన్‌టీ, చిన్నపిల్లల వార్డు, చెస్ట్ వార్డు, ఆర్థో, గైనిక్ తదితర విభాగాల్లో ఎల్ఈడీ టీవీలను ఏర్పాటు చేశారు. ఆరోగ్య సమాచారాన్ని అందులో డిస్‌ప్లే అయ్యేలా చర్యలు తీసుకోనున్నారు. వీటి నిర్వహణకు ఓ వ్యక్తిని ఉంచేలా సంబంధిత కాంట్రాక్టర్ చర్యలు తీసుకున్నారు. రెండు, మూడు రోజుల్లో వాటి నిర్వహణ జరిగేలా చర్యలు తీసుకోనున్నట్లు ఆస్పత్రి వర్గాలు తెలిపాయి.

నేడు ద్విచక్రవాహనాల వేలం

చెన్నేకొత్తపల్లి: స్థానిక సెబ్ పోలీస్‌స్టేషన్ ఆవరణలో బుధవారం ద్విచక్రవాహనాల వేలం నిర్వహించనున్నట్లు సెబ్ సీఐ లలితాదేవి, ఎస్ఐ శివప్రసాద్ తెలిపారు. రామగిరి, చెన్నేకొత్తపల్లి, కనగానపల్లి మండలాల్లో ఎక్సైజ్ కేసుల్లో పట్టుబడిన 4 ద్విచక్రవాహనాలను బహిరంగ వేలం వేస్తామన్నారు. వేలంలో పాల్గొనదలచిన వారు ఉదయం 10 గంటలకు స్టేషన్ వద్ద డిపాజిట్ చెల్లించి పాల్గొన వచ్చని సూచించారు.

మందులతో కుష్టు నయం

• డీపీఎంఓ సత్యనారాయణ



పుండ్లు కాకుండా ఎలా శుభ్రం చేసుకోవాలో అవగాహన కల్పిస్తున్న అధికారులు

కూడేరు: కుష్టు వ్యాధిని ప్రాథమిక దశలో గుర్తించి, క్రమం తప్పకుండా మందులు వాడితే పూర్తిగా నయమవుతుందని డీపీఎంఓ సత్యనారాయణ తెలిపారు. మంగళవారం మండలంలోని కుష్టు రోగుల కాలనీలో 'అంగవైకల్య నివారణ – వైద్య పునరావాస' కార్యక్రమంపై కుష్టు వ్యాధిగ్రస్తులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వ్యాధి ప్రాథమిక దశ దాటి మందులు వాడుతున్న వారు తప్పక పరిశుభ్రత పాటించాలని డీపీఎంఓ సత్యనారాయణ తెలిపారు. లేదంటే కాళ్లు,చేతి వేళ్లకు పుండ్లు ఏర్పడి ఇబ్బంది పడాల్సి వస్తుందన్నారు.వైద్యాధికారిణి సౌమ్యారెడ్డి, హెల్త్ సూపర్‌వైజర్ రవీంద్ర, ఎంఎల్‌హెచ్‌పీ చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో పెద్ద సరిగెత్తు వేడుకలు

అనంతపురం కల్చరల్: ఐదో రోడ్డులోని కుసుమూరు ఖాలేషా మస్తాన్‌వలి హజరత్ మౌలాలి దర్గాలో మంగళవారం రాత్రి మొహర్రం వేడుకలు ఘనంగా నిర్వహించారు. పెద్ద ఎత్తున తరలివచ్చిన భక్తులు చక్కెర చదివింపులతో మొక్కులు తీర్చుకున్నారు. ఈసందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ బుధవారం పానకాల జాతర, గురువారం అగ్నిగుండ ప్రవేశం, 20న చివరి దర్శనం ఏర్పాటు చేశామన్నారు. నాలుగో రోడ్డు పెనుకొండ బాబయ్య పీర్లమకానంలో ప్రత్యేక పూజలు జరిగాయి. హజరత్ సయ్యద్ మస్తాన్‌వలి బాబా పీర్ల సందడి భక్తుల్లో ఆధ్యాత్మిక భావాన్ని పెంచింది. పాతూరు, రామనగర్, రహమత్‌నగర్, రాణినగర్ ప్రాంతాల్లో మొహర్రం వేడుకలు ఘనంగా జరిగాయి. ఇదిలా ఉండగా పెద్ద పీర్ల పండుగను పురస్కరించుకొని శాంతినగర్‌లోని బార్గా హె చిస్తియా దర్గాలో ఏర్పాటు చేసిన పవిత్ర కేశాన్ని మేయర్ వసీం దర్శించుకున్నారు. అనంతరం హజరత్ హసేన్, హసేన్ పీర్ల విశేషాలను తెలుసుకున్నారు కార్యక్రమంలో కార్పొరేటర్లు ఇషాక్, కమల్ భూషణ్, వైఎస్సార్‌సీపీ నాయకులు జావిద్, శీనా తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు: మొహర్రం వేడుకల్లో భాగంగా మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం పెద్ద సరిగెత్తు వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భక్తులు పానకాల కుండలను తలపై పెట్టుకొని డప్పులతో పీర్ల చావిడి వద్దకు తీసుకెళ్లి చదివింపులు చేయించారు. ఆత్మకూరులోని సర్దార్ వలి దర్గాలో వేలాది మంది భక్తులు చక్కెర చదివింపులు చేయించి మొక్కులు తీర్చుకున్నారు. మండలం నుంచే కాకుండ జిల్లా వ్యాప్తంగా పలు గ్రామాల నుంచి వేలాది మంది ఉత్సవాలకు తరవలిచ్చారు. మొక్కుబడి ఉన్న భక్తులు చెట్లను కొట్టి ఎద్దులు, ట్రాక్టర్ల ద్వారా గుండం వద్దకు తరలించారు. అనంతపురం, బెంగళూరు తదితర ప్రాంతాలను నుంచి రూ.వేలు విలువజేసే పూలమాలలను తీసుకొచ్చి పీర్లను అలంకరించారు. వేడుకల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు గట్టి బందోబస్తు నిర్వహించారు.

కనగానపల్లిలో..

కనగానపల్లి: మొహర్రం ఉత్సవాల్లో భాగంగా మంగళవారం పలు గ్రామాల్లో పెద్ద సరిగెత్తు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలో దస్తరిగి, వన్నూరుస్వామి ఉత్సవాల్లో పీర్లస్వాములను ప్రత్యేకంగా అలంకరించి ఊరేగించారు.

భక్తులు పీర్లస్వాములకు చెక్కర, గంధం చదివింపులు చేసి మొక్కులు తీర్చుకున్నారు. ఇక పీర్ల చావిడి ముందర అగ్నిగుండాలు వెలగించి పిల్లలు, పెద్దలు వాటి చుట్టూ తిరుగుతూ ఉత్సాహంగా అలావు తొక్కారు. కాగా బుధవారం చివరి రోజు పీర్లస్వాములను అగ్నిగుండ ప్రవేశం చేయించి జలధి కార్యక్రమాన్ని నిర్వహిస్తామని గ్రామపెద్దలు తెలిపారు.



కసూమూరు ఖాలేషా మస్తాన్‌వలి బ్రహ్మోత్సవ సందడి



ఆత్మకూరు సర్దార్ వలి దర్గాలో చక్కెర చదివింపులు చేయిస్తున్న భక్తులు





ఆత్మకూరులో చెట్లను గుండంలోకి తరలిస్తున్న భక్తులు, ఆత్మకూరులో కొలువుదీరిన పీర్లు



బాబయ్య పీర్లమకానంలో పూజలందుకున్న పీర్లు



కొలువుదీరిన హజరత్ సయ్యద్ మస్తాన్‌వలీ పీర్లు



మొహర్రం వేడుకల్లో పాల్గొన్న మేయర్ వసీం తదితరులు



పీర్లచావిడి ముందు వెలుగుతున్న అగ్ని గుండం

ఉపాధ్యాయ పోరాట యోధుడు రమేష్

అనంతపురం ఎడ్యుకేషన్: ఉపాధ్యాయ ఉద్యమాల్లో అలుపెరగని పోరాట యోధుడు దివంగత హెచ్ఎం జె.రమేష్ అని పలువురు కొనియాడారు. నాలుగో వర్ధంతి సందర్భంగా నగరంలోని ఎస్కేడీ పాఠశాలలో మంగళవారం కార్యక్రమం ఏర్పాటు చేశారు. ముందుగా జె.రమేష్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పలువురు మాట్లాడుతూ ఉపాధ్యాయులకు, సంఘాలకు మార్గదర్శకుడిగా తనకంటూ ఒక ప్రత్యేకమైన చెరగని ముద్ర వేసుకున్నారన్నారు. జె.రమేష్ సతీమణి కస్తూర్బా బాలికల పాఠశాల హెచ్ఎం డి.విజయలక్ష్మి, ఎస్కేడీ పాఠశాల హెచ్ఎం శాంసన్ కుమార్, ఏపీటీఎఫ్, ఎస్టీయూ నాయకులు సిరాజుద్దీన్, ఎస్. రామాంజనేయులు నగరపాలక ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య సభ్యులు ఎన్.ఓబులేసు, ఫణి భూషణ్, యుగంధర్, గంగాధర్, రమేష్ బాబు, భాగ్యరాజు బీసీ ఉద్యోగుల సంఘం నాయకులు పుట్టా శ్రీధర్, నరహరి, ఎం.మురళీకృష్ణ, రాజన్న, విరుపాక్షి గౌడ్, రవికుమార్, గోవర్ధన్, పి.శ్రీనివాసులు, జి.ప్రభాకర్, కె.సురేష్ నాయక్, రమేష్, సోమశేఖర్ పాల్గొన్నారు.



రమేష్ వర్ధంతిలో పాల్గొన్న ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు

బ్లడ్ బ్యాంకులో చీరల దుకాణం

అనంతపురం మెడికల్: ప్రభుత్వ సర్వజనాస్పత్రిలోని బ్లడ్ బ్యాంకులో స్టాఫ్‌నర్సులు చీరల వ్యాపారానికి తెరలేపారు. రోగులకందించే సేవల్లో నిమగ్నమవ్వాల్సిన స్టాఫ్‌నర్సులు. విధులను పక్కన పెట్టి చీరల కొనుగోలులో బిజీగా ఉన్నారు. మంగళవారం సర్వజనాస్పత్రిలోని బ్లడ్ బ్యాంకులో గైనిక్ విభాగంలో విధులు నిర్వర్తించే స్టాఫ్‌నర్సు జయమ్మ. చీరల కొనుగోలు చేసే పనిలో నిమగ్నమయ్యారు. రక్తనిధి కేంద్రానికి రక్తం కోసం రోగి సహాయకులు కొండంత ఆశతో వస్తుంటారు. దీంతోపాటు రక్తదానం చేస్తుంటారు. ఇటువంటి ప్రాంతంలో వ్యాపారాలు చేయడం సర్వత్రా విమర్శలకు దారి తీస్తోంది. వాస్తవంగా గైనిక్ వార్డు బాలింతలతో కిటకిటలాడుతుంటుంది. అటువంటిది స్టాఫ్‌నర్సులు విధుల్లో ఉండకుండా రోగుల ఆరోగ్యం పట్ల నిర్లక్ష్యం వహిస్తున్నారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో అధికారులు మేలుకుంటారో లేదో చూడాలి.



చీరలను చూస్తున్న ఆస్పత్రి సిబ్బంది

అలరించిన 'సౌందర్య లహరి'

అనంతపురం కల్చరల్: జగద్గురు శంకరాచార్యులు రచించిన సౌందర్య లహరిపై ప్రత్యేక శిక్షణ కార్యక్రమం మంగళవారం ముగిసింది. సంగీత విదూషిమణి గుంటూరు సంధ్యామూర్తి నేతృత్వంలో స్థానిక అశోక్‌నగర్‌లోని రమా సమేత సత్యనారాయణస్వామి ఆలయం వేదికగా పదిరోజుల పాటు శిక్షణ ఇచ్చారు. ఈసందర్భంగా ఉదయం సౌందర్యలహరి సమేత నవగ్రహ, గణపతి హోమాలను అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. దాదాపు 200 మంది మహిళలు సౌందర్యలహరిని పఠించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు అంబటి ఫణిరాజ్, వెంకటకృష్ణారెడ్డి మాట్లాడుతూ గత 30 ఏళ్లుగా శ్రీనృత్యకళానిలయం ద్వారా సంధ్యామూర్తి అందిస్తున్న ఆధ్యాత్మిక సేవల్లో భాగంగా సౌందర్యలహరిలోని వంద శ్లోకాలను రాగయుక్తంగా నేర్పించడం ఆనందంగా ఉందన్నారు. సంస్కృత ఉచ్ఛారణతో సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని, మానసిక ప్రశాంతత ఏర్పడుతుందని పెద్దలు చెబుతుంటారన్నారు. ఈ సందర్భంగా సంధ్యామూర్తిని కమిటీ సభ్యులు సత్కరించారు. కార్యక్రమంలో భూపాలం కిశోర్, రవీంద్ర, కరుణాదేవి, నిర్మల, మంజుల, శ్రీలత, వీణ తదితరులు పాల్గొన్నారు.



సంధ్యామూర్తిని సత్కరిస్తున్న దృశ్యం

కాలువల్లో వ్యర్థాలు తొలగించండి

• మేయర్ వసీం

అనంతపురం కార్పొరేషన్: కాలువల్లో వ్యర్థాలు తొలగించాలని ప్రజారోగ్యాధికారులను మేయర్ వసీం ఆదేశించారు. మంగళవారం నగరంలోని ఫ్లై ఓవర్ బ్రిడ్జ్ పవిత్ర హైపర్ మార్ట్ సమీపంలో డ్రైనేజీలో నీరు సక్రమంగా వెళ్లకుండా దుర్వాసన వస్తోందని రాంనగర్ ప్రాంత ప్రజలు మేయర్‌కు విజ్ఞప్తి చేయగా..మేయర్ ఆ ప్రాంతాన్ని సందర్శించారు. సంబంధిత అధికారులతో మాట్లాడిన మేయర్ దగ్గరుండి పూడికతీత పనులు చేపట్టేలా చూశారు. వర్షాకాలంలో కాలువల్లో ఎప్పటికప్పుడు పూడికతీత పనులు చేపట్టాలన్నారు. ఎక్కడా చెత్తాచెదారం కన్పించకూడదన్నారు. మేయర్ వెంట ఎంహెచ్ఓ డాక్టర్ విష్ణుమూర్తి, కార్పొరేటర్ అనిల్‌కుమార్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కొండ్రెడ్డి ప్రకాష్‌రెడ్డి, నాయకులు నాగార్జునరెడ్డి, తదితరులున్నారు.



పూడికతీత పనులను పరిశీలిస్తున్న మేయర్ వసీం

తొలి ఏకాదశి వేడుకలకు సిద్ధం

అనంతపురం కల్చరల్: తొలి ఏకాదశి వేడుకలకు నగరంలోని ఆలయాలు సిద్ధమయ్యాయి. భవసార క్షత్రియులు ఎంతో భక్తిశ్రద్ధలతో నిర్వహించుకునే దేవశయని ఏకాదశి సందర్భంగా రామనగర్‌లో వెలసిన రుక్మిణీ పాండురంగస్వామి ఆలయంలో బుధవారం ఉదయం 8 నుంచి రాత్రి 8 గంటల వరకు రుక్మిణి పాండురంగస్వామి వార్ల నిజపాద దర్శనం ఉంటుందని కమిటీ సెక్రటరీ ఆనంద్ మహేంద్రకర్ తెలిపారు. పాతూరులోని శృంగేరి శారదా పీఠం దత్తాత్రేయ దేవస్థానంలో సామూహిక విష్ణు సహస్రనామ పారాయణాన్ని 11 పర్యాయాలు నిర్వహిస్తామని ఆలయ కమిటీ సభ్యులు పేర్కొన్నారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పారాయణం ఏర్పాటు చేశామని, భక్తులు తీర్థప్రసాదాలను స్వీకరించాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

గార్లదిన్నె: మండల కేంద్రం సమీపంలో 44వ జాతీయ రహదారిపై మంగళవారం జరిగిన ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి.పోలీసుల వివరాలమేరకు.. యర్రగుంట్లకు చెందిన క్రిష్ణారెడ్డి, గార్లదిన్నెకు చెందిన ఆంజనేయులు ద్విచక్రవాహనంలో అనంతపురం వైపు బయలుదేరారు. లోలూరు క్రాస్ సమీపంలోకి రాగానే వెనుక నుంచి గుర్తు తెలియని ఫార్చునర్ వాహనం ఢీకొని వెళ్లిపోయింది. కిందపడిన ఇద్దరికీ రక్తగాయాలయ్యాయి. స్థానికులు క్షతగాత్రులను అనంతపురంఆస్పత్రికి తరలించారు. పోలీసులు ప్రమాదంపై ఆరా తీశారు.

బైక్ అదుపు తప్పి వ్యక్తికి గాయాలు

గుత్తి రూరల్: మండలంలోని శ్రీపురం గ్రామ శివారులో మంగళవారం ద్విచక్రవాహనం అదుపు తప్పి బోల్తా పడి కంబయ్య అనే వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసుల వివరాలిలా ఉన్నాయి.

గుత్తి పట్టణంలోని గాంధీనగర్‌కు చెందిన కంబయ్య పని నిమిత్తం కుమారుడితో కలిసి ద్విచక్రవాహనంలో గుంతకల్లుకు వెళ్లాడు. అక్కడ పని ముగించుకుని తిరిగి గుత్తికి వస్తుండగా శ్రీపురం గ్రామ శివారులో 67వ నంబర్ జాతీయ రహదారిపై వేగంగా వెళ్తున్న వారి ద్విచక్రవాహనం అదుపు తప్పి బోల్తా పడింది. ప్రమాదంలో గాయపడిన కంబయ్యను 108 వాహనం ద్వారా గుత్తి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనంతరం వైద్యుల సూచన మేరకు కంబయ్యను అనంతపురంకు తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

శ్రీ చైతన్య పాఠశాలలో 'గ్రీన్ ఇండియా మిషన్'

అనంతపురం ఎడ్యుకేషన్: 'స్మార్ట్ లివింగ్' కార్యక్రమంలో భాగంగా మంగళవారం స్థానిక కమ్మ భవన్ సమీపంలోని శ్రీచైతన్య ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో 'గ్రీన్ ఇండియా మిషన్' కార్యక్రమం ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన పాఠశాలల ఏజీఎం సుబ్బారెడ్డి మొక్కలు నాటారు. భావితరాలకు ప్రకృతి వైపరీత్యాలు కలగకుండా ఉండాలంటే ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని ఆయన కోరారు. అనంతరం విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. విజేతకు ఏజీఎం బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ విశ్వనాథ్, కోఆర్డినేటర్ రాధాకృష్ణ, డీన్లు రిషిబాల, ముత్యాలన్న, సతీష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చెట్లు ప్రగతికి మెట్లు

రాప్తాడురూరల్: చెట్లు ప్రగతికి మెట్లు అని పలువురు పేర్కొన్నారు. మంగళవారం అనంతపురం రూరల్ మంలం కురుగుంట ఆస్పత్రి ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ రాయలసీమ జిల్లాల నాయకుడు రమణ మాట్లాడుతూ పర్యావరణాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ప్రతి ఒక్కరూ ఒక మొక్క నాటాలన్నారు. కార్యక్రమంలో పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.



మొక్క నాటుతున్న చైతన్య పాఠశాలల ఏజీఎం సుబ్బారెడ్డి

రుక్మిణీ పాండురంగస్వామి బ్రహ్మోత్సవం

పామిడి: పట్టణంలోని పెద్ద విఠోబ, చిన్న విఠోబ ఆలయాల్లో మంగళవారం వేర్వేరుగా రుక్మిణీ పాండురంగస్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. వరుసగా వారంరోజులు పాటు నిర్వహించే ఈ బ్రహ్మోత్సవాల్లో భాగంగా డబ్బేదార్ ఫిర్కా ఆధ్వర్యంలో పెద్ద విఠోబస్వామి ఆలయంలోని, అలాగే రంగసుభే ఫిర్కా ఆధ్వర్యంలో చిన్న విఠోబ దేవాలయంలో రుక్మిణీ పాండురంగస్వామి విగ్రహాలను శోభాయానంగా అలంకరించారు. వేద పండితుల మంత్రోచ్ఛారణ నడుమ ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు భక్తి ప్రపత్తులతో దేవతామూర్తులను పూజించి, తరించారు. సంకీర్తనాలాపనలు, భజనలు చేశారు. ఈసందర్భంగా డబ్బేదార్ ఫిర్కా కమిటీ సభ్యులు శ్రీనివాసరావు, రవీంద్రనాథ్‌రావు, గోందళే రాజశేఖర్‌రావు మాట్లాడారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈనెల 20న మధ్యాహ్నం 3 గంటలకు సాయంత్రం భావసార క్షత్రియ కులస్తుల సంతర్పణ, 21న సాయంత్రం 7గంటలకు దేవతామూర్తుల భైయిండి రథోత్సవం, 22న సాయంత్రం 7 గంటలకు వసంతోత్సవంతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయన్నారు. 23న మంగళవారం పామిడమ్మ దేవత హారతి ఉంటుందన్నారు.



సకాలంలో జనన, మరణ ధ్రువీకరణ పత్రాల మంజూరు

అనంతపురం కార్పొరేషన్: సకాలంలో జనన, మరణ ధ్రువీకరణ పత్రాల మంజూర్యేలా చర్యలు తీసుకుంటున్నట్లు కమిషనర్ మేఘ స్వరూప్ పేర్కొన్నారు. ఈ మేరకు నగరపాలక సంస్థ కార్యాలయం మంగళవారం ఓ ప్రకటన విడుదల చేసింది. సచివాలయం, మీ సేవలో దరఖాస్తు చేసుకున్న వారి వివరాలు యునైటెడ్ బర్త్ రిజిస్ట్రేషన్ సైట్‌లో కనపించడం లేదని, కానీ సంబంధిత తల్లిదండ్రులు తగిన ఆధారాలను నగరపాలక సంస్థలోని జనన, మరణ ధ్రువీకరణ పత్రాల కార్యాలయంలో చూపితే సర్టిఫికెట్‌ను మంజూరు చేస్తారని తెలిపారు. 2016లోపు ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో జన్మించి మునిసిపల్ రికార్డులో పొందుపర్చిన ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

పీజీలదే భారం

• మధ్యాహ్నా ఓపీల్లో కన్పించని వైద్యులు



మెడిసిన్ ఓపీలో రోగులను చూస్తున్న పీజీ వైద్యులు

అనంతపురం మెడికల్: ప్రభుత్వ సర్వజనాస్పత్రిలోని పలు విభాగాల్లో అసిస్టెంట్, అసోసియేట్ ప్రొఫెసర్లు పత్తా లేకుండా పోతున్నారు. మధ్యాహ్న వేళ ఓపీ సేవల్లో సీనియర్ వైద్యులుండడం లేదు. పీజీలపైనే భారం పెట్టి చెక్కేస్తున్నారు. మంగళవారం ప్రభుత్వ సర్వజనాస్పత్రిలోని మెడిసిన్, తదితర విభాగాల్లో సీనియర్ వైద్యులు కనిపించలేదు. వాస్తవంగా మధ్యాహ్నం 3 నుంచి 4 గంటల వరకు వైద్యులు అందుబాటులో ఉండాలి. కనీసం గంటపాటు కూడా సీనియర్ వైద్యులుండకపోవడం సర్వత్రా విమర్శలకు దారి తీస్తోంది. ఇప్పటికైనా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలి.

చికిత్స పొందుతూ వైఎస్సార్‌సీపీ నేత మృతి



సూర్యనారాయణ (ఫైల్)

రాప్తాడు: ఎం.బండమీదపల్లికి చెందిన వైఎస్సార్ సీపీ సీనియర్ నేత సూర్యనారాయణ(58) చికిత్స పొందుతూ మృతి చెందాడు. కుటుంబ సభ్యుల వివరాల మేరకు....ఈ నెల 10న సూర్యనారాయణ, అతని మిత్రుడు మారక సుబ్బారెడ్డితో కలిసి బైక్‌పై అనంతపురం బయలుదేరారు. గ్రామం దాటి రెండు కిలో మీటర్లు రాగానే కళ్లు తిరుగుతున్నాయని బైక్‌ను రోడ్డు పక్కన ఆపి కింద పడిపోయాడు. వెంటనే కుటుంబ సభ్యులు అనంతపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. తర్వాత ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లగా బ్రెయిన్ స్ట్రోక్ వచ్చిందని వైద్యులు ఆపరేషన్ చేయగా కోమాలోకి వెళ్లాడు. పరిస్థితి విషమించడంతో మంగళవారం సాయంత్రం మృతి చెందాడు. మృతునికి భార్య, కుమారుడు, ముగ్గురు కుమార్తెలున్నారు. ఎంపీపీ చిట్రెడ్డి జయలక్ష్మీ, ఆమె భర్త సత్యనారాయణ రెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు పసుపుల హేమావతి, ఆమె భర్త ఆది, వైస్ ఎంపీపీ బోయ రామాంజనేయులు, మండల కన్వీనర్ జూటూరు శేఖర్ తదితరులు సూర్యనారాయణ మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఏకలవ్య జయంతికి తరలిరండి

చెన్నేకొత్తపల్లి: మండల కేంద్రంలో బుధవారం జరగనున్న ఏకలవ్య జయంతి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎరుకుల సంఘం సభ్యులు మంగళవారం కోరారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ఎరుకల ప్రజాపోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జల సురేష్ మాట్లాడుతూ స్థానిక అంబేడ్కర్ విగ్రహ ఆవరణంలో ఏకలవ్య జయంతిని ఘనంగా నిర్వహిస్తున్నామన్నారు. మండలంలోని వివిధ గ్రామాల్లో ఉన్న ఏరుకల సోదరులు పెద్ద ఎత్తున తరలి రావాలని కోరారు. అనంతరం ఎరుకల సోదరుల సమస్యలపై చర్చిస్తామన్నారు.

ఇంజక్షన్ చేశారు.. ప్రాణాలు కాపాడారు

గుత్తి: గుత్తి ప్రభుత్వాస్పత్రికి గుండెపోటుతో వచ్చిన రోగికి తక్షణమే ఇంజక్షన్ ఇచ్చి ప్రాణాపాయం నుంచి కాపాడారు. వివరాలు.. నంద్యాల జిల్లా డోన్ మండలం కొత్త బురుజు గ్రామానికి చెందిన చిన్న ఓబులేసుకు ఛాతీనొప్పి రావడంతో తెల్లవారుజామున 5.30కు ఆస్పత్రి వచ్చాడు. సూపరింటెండెంట్ డాక్టర్ ఎల్లప్ప అతడికి ఈసీజీ చేసి రక్తనాళాలు బ్లాక్ అయినట్లు గుర్తించారు. వెంటనే టినాక్టప్లస్ ఇంజక్షన్ ఇచ్చి అతడి ప్రాణాల కాపాడారు. అనంతరం చిన్న ఓబులేసును కర్నూలుకు తరలించారు. ఇంజక్షన్ రూ.40 వేలు విలువ చేస్తుందని వైద్యులు తెలిపారు. రోగి కుటుంబ సభ్యులు ఆస్పత్రి సూపరింటెండెంట్‌కు కృతజ్ఞతలు తెలిపారు.